ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం


చోడవరంలో మందులు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ సునీతాశర్మ, సర్పంచి వెంకటరత్నం, తహసీల్దార్ శివయ్య

పెనమలూరు: ప్రజారోగ్యమే లక్ష్యమని, ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఉచిత వైద్యసేవలు అందజేస్తోందని చోడవరం సర్పంచి కాకర్ల వెంకటరత్నం అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం రెండవ విడత శుక్రవారం చోడవరంలో ప్రారంభించి ప్రసంగించారు. ప్రజారోగ్యంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. అర్హులకు ఆరోగ్యశ్రీ అమలు చేస్తున్నారని తెలిపారు. ఆరోగ్యశ్రీ వైద్య సేవలు రూ.25 లక్షల వరకు పెంచారన్నారు. గ్రామాల్లో జగనన్న వైద్య సురక్ష శిబిరాల్లో ఉచితంగా వైద్య సేవలు, మందులు పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సునీతాశర్మ, తహసీల్దార్ కట్టా వెంకట శివయ్య, ఏవో లోయ శివశంకర్, మండల వైద్యాధికారి బిజిలీ శ్రీనివాస్, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

విస్తృత వైద్య సేవలు

తాడిగడప మున్సిపాలిటీలో విస్తృతంగా వైద్య సేవలు అందిస్తున్నామని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎస్.ప్రకాశరావు అన్నారు. కానూరు 1వ సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండో విడత వైద్య శిబిరాలను మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్నామని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, నేతలు అంగిరేకుల సీతారామయ్య, తుమాటి శ్రీరాములు, చాంద్‌బాషా, కె.క్రిస్టోఫర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష పేదలకు వరం

రామవరప్పాడు: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని ఎనికేపాడు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు అన్నారు. రూరల్ మండలం ఎనికేపాడు సచివాలయం-1 పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలోభాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. పూర్ణచంద్రరావు మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యశాలలకు వెళ్లి ఖర్చుతో కూడుకున్న వైద్య సేవలు పొందలేని పేదలకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో సేవలు అందిస్తోందని తెలిపారు. గ్రామంలో తొలి విడత విజయవంతంగా నిర్వహించామన్నారు. రెండో విడత కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. జెడ్పీటీసీ సువర్ణరాజు మాట్లాడుతూ 'సురక్ష'తో సంపూర్ణ వైద్య సేవలు అందుతున్నాయన్నారు. అనంతరం సుమారు 500 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్. వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్యసేవలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: రాష్ట్రంలోని పేద ప్రజలకు మెరుగైన, నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని చేపట్టారని వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు అన్నారు. బాపులపాడు మండలం వేలేరులో 'జగనన్న ఆరోగ్య సురక్ష- ఫేజ్ 2'లో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రజారోగ్యానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకం, 108 అంబులెన్స్, 104 వాహనం ద్వారా పేద ప్రజలకు వైద్యసేవలను అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. నాడు-నేడుతో ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలను మార్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. బాపులపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎంజే మంజూష నేతృత్వంలోని వైద్యుల బృందం గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యశిబిరంలో 526 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, సర్పంచ్ సాదిమెళ్ల సుందరమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు కొడాలి సత్య ప్రభాకర్, దోనవల్లి సూరిబాబు, పాలిమెట్ల యాకోబు పాల్గొన్నారు.


జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందజేస్తున్న సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు తదితరులు


వేలేరులో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ మంజూష

క్లుప్తంగా

అన్నదానానికి రూ. 1.70 లక్షల విరాళం



రామవరప్పాడు: పేరంటాలమ్మ ఆలయంలో నిర్వహించే సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20న నిర్వహించే అన్నసంతర్పణకు ఢిల్లీ పబ్లిక్‌స్కూల్ అధినేత పరిమి నరేంద్ర బాబు రూ. 1.70 లక్షల విలువజేసే చెక్కును ఆలయ కమిటీ చైర్మన్ బోయిన భాను ప్రదీప్, ఈఓ పి. లోకేశ్వరికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా బోయిన భానుప్రదీప్ మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి 18 వరకు సంక్రాంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏటా అన్నసంతర్పణకు పరిమి నరేంద్రబాబు సహకారం అందజేస్తున్నారని, ఈ సంవత్సరం కూడా విరాళం అందజేయడం సంతోషంగా ఉందని ఆలయ అధికారులు తెలిపారు.

పేరంటాలమ్మ హుండీ ఆదాయం రూ. 4.34 లక్షలు



రామవరప్పాడు: రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో భక్తులు కానుకల ద్వారా హుండీల్లో సమర్పించిన ఆదాయం రూ. 4,34,754 అని ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని హుండీల్లో కానుకలను శుక్రవారం దేవదాయ శాఖాధికారి అనురాధ సమక్షంలో లెక్కించారు. లోకేశ్వరి మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలోని హుండీల్లో కానుకలను 48 రోజులకు లెక్కించగా ఈ ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బోయిన భానుప్రదీప్, సేవా దళ్ సభ్యులు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన సదస్సు



పెనమలూరు: రక్తదానం చేస్తే ఆరోగ్యంగా జీవించవచ్చని పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీ వైద్యుడు వల్లభనేని కల్యాణచక్రవర్తి అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన రక్తదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కల్యాణచక్రవర్తి మాట్లాడుతూ రక్తదానం చేస్తే గుండెజబ్బులు, బరువు తగ్గడం, క్యాన్సర్, దీర్ఘకాల వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని తెలిపారు. ప్రమాదాలు జరిగిన సమయంలో, తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తదానం చేస్తే ప్రాణాలు కాపాడవచ్చని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో రక్తదానం చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని ఆర్‌బీకేల్లోనే విక్రయించండి

ఏఓ రంగనాథ్

పాతపాడు(విజయవాడరూరల్): ధాన్యాన్ని ఆర్‌బీకేల్లోనే విక్రయిస్తే రైతులకు ప్రయోజనం కలుగుతుందని మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు అన్నారు. పాతపాడులో రైతులు, సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కచ్చితమైన తూకం, తేమశాతం, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అమ్మిన ధాన్యానికి డబ్బు చెల్లిస్తామని ఏఓ తెలిపారు. పాతపాడు గ్రామ పరిధిలో మొత్తం 650 ఎకరాలకు 1500 మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేసిందని, 150 టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. సమావేశంలో వ్యవసాయశాఖ సిబ్బంది, సచివాలయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిరీక్షణతో జీవించాలి



ఉంగుటూరు: బ్రదర్ జోసఫ్ తంబి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ నిరీక్షణతో జీవించాలని వరంగల్ బిషప్ తుమ్మా బాల స్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ తాటికొండ జోసఫ్ అన్నారు. ఉంగుటూరు మండలం పెద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్‌తంబి 79 వర్ధంతి మహోత్సవాల నవదిన ప్రార్థనలు రెండవ రోజు శుక్రవారం కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆయన దివ్యపూజాబలిని సమర్పించి 'నిరీక్షణ క్రైస్తవ జీవిత సత్యం'పై ప్రసంగించారు. క్రైస్తవ సత్యాలను తెలుసుకుని గొప్ప ఆశతో క్రీస్తు కోసం నిరీక్షణతో జీవించాలని తెలిపారు. నవదిన ప్రార్థనల్లో పాల్గొన్న గురువులకు రెక్టర్ ఫాదర్ పాలడుగు జోసఫ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విచారణ గురువు ఫాదర్ అభిలాష్ గోపు, పలువురు ఫాదర్లు, సంఘస్తులు పాల్గొన్నారు.

10 నుంచి ముగ్గుల పోటీలు: స్నిగ్ధ



కంకిపాడు: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని రక్ష ఫౌండేషన్ ఆధ్వర్యాన పెనమలూరు నియోజకవర్గంలో రంగవల్లుల పోటీలు నిర్వహించనున్నట్లు రక్ష ఫౌండేషన్, డీసీఎంఎస్ చైర్‌పర్సన్, పడమట స్నిగ్ధ చెప్పారు. ఆమె శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. సంక్రాంతి పండుగ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకన్నారు. సంక్రాంతి సందర్భంగా నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు, వైఎస్సార్ తాడిగడప, ఉయ్యూరు మున్సిపాలిటీల్లో 90కిపైగా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో మహిళలు, యువతులకు రంగవల్లుల పోటీలు నిర్వహించనున్నామన్నారు. ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకూ ఆయా సచివాలయాల పరిధిలో ముగ్గుల పోటీలు జరుగుతాయన్నారు. వీటికి అవసరమైన సామగ్రిని తామే అందిస్తామన్నారు. పాల్గొనదలచిన ఔత్సాహిక మహిళలు, యువతులు 87909 37269, 9848828222 నంబర్లలో సంప్రదించాలని, వాట్సాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఆరోగ్య శ్రీ కార్డుల అందజేత

గన్నవరం రూరల్: గొల్లనపల్లిలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది శుక్రవారం పర్యటించారు. ఈ నెల 9న గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 జరగనుంది. ఏఎన్ఎం బలుసులమ్మ, సీహెచ్‌వో ప్రేమావతి ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక వైద్యం పీహెచ్‌సీల ద్వారా అందిస్తూ ఫ్యామిలీ డాక్టర్, 104 కాల్ సెంటర్, విలేజ్ హెల్త్ క్లినిక్, 108అంబులెన్స్ సర్వీస్ వంటి అనేక సేవలను అందుబాటులోకి తెచ్చిందని పేర్కొన్నారు. ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. డ్రైడే ఫ్రైడే ప్రదర్శన చేశారు.

పేదల సంక్షేమానికి జగనన్న కృషి

కంకిపాడు: అన్ని వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. మండలంలోని ఈడుపుగల్లులో శుక్రవారం లబ్ధిదారులకు పింఛన్లను అందించారు. లబ్ధిదారులను స్నిగ్ధ ఆత్మీయంగా పలకరించి వైఎస్సార్ పింఛను కానుక పంపిణీ చేశారు. రక్ష ఫౌండేషన్ వితరణతో వృద్ధులకు చీరలు, పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా స్నిగ్ధ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పింఛను రూ. 3 వేలు పెంచిన ఘనత సీఎం జగన్‌దేమోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికల సమీపిస్తుండటంతో ప్రతిపక్షాలు ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. అభూత కల్పనలు, విష రాజకీయాలు చేస్తూ ప్రజల్ని గందరగోళానికి గురి చేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగనమోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ బాసటగా నిలవాలన్నారు. ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.


ఈడుపుగల్లులో పింఛను ఇచ్చి చీర, పండ్లు అందజేస్తున్న పడమట స్నిగ్ధ

8న వేదసభ, ప్రత్యేక పూజలు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని చినకంచిలో ఈ నెల 8వ తేదీన చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి ఆరాధన కార్యక్రమం జరగనుందని ట్రస్టీ మొక్కపాటి శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆ రోజు ఉదయం పంచామృతాలతో స్వామికి అభిషేకాలు, వేదసభ నిర్వహిస్తారని పేర్కొన్నారు.

సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకోవాలి

ఉంగుటూరు: విద్యార్థులు సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకుంటేనే ఉన్నత ఉద్యోగాల్లో రాణిస్తారని ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఏపీఎస్‌సీహెచ్‌ఈ) ప్రొఫెసర్ కె.రామ్మోహనరావు అన్నారు. ఉంగుటూరు మండలం తేలప్రోలు ఉషా రామ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల జాతీయస్థాయి టెక్నోకల్చరల్ ఫెస్ట్-2024 శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కాలానుగుణంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. ఫెస్ట్ పురస్కరించుకుని సాంకేతిక కార్యక్రమాలు, సృజనాత్మకత పోటీలు, ప్రతిభ ఆధారిత సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి మూడు వేల మంది విద్యార్థులు పలు పోటీల్లో ప్రాతినిధ్యం వహించారు. 30పైగా స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం ముఖ్య అతిథి ప్రొఫెసర్ రామ్మోహనరావును శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం, టెక్ మహీంద్ర డెలివరీ హెడ్ కె.ప్రభాకర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్, డైరెక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.


రామ్మోహనరావును సన్మానిస్తున్న కళాశాల చైర్మన్ రాంబ్రహ్మం

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

రామవరప్పాడు: మత్తు పదార్థాల బారిన పడితే విలువైన జీవితాలు చిత్తవుతాయని నీ తోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో ఆర్డినేటర్ ప్రియాంక అన్నారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో 'మత్తు పదార్థాల దుర్వినియోగంపై' అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రియాంక మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో మాదక ద్రవ్యాల వినియోగాన్ని నివారించాలన్నారు. అవగాహన లోపంతో విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు బానిసవుతున్నారన్నారు. నవజీవన్ జోనల్ కో ఆర్డినేటర్ ఎండీ వసంతకుమారి మాట్లాడుతూ సరదాగా మొదలైన అలవాటు బానిసలుగా మారుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

వ్యసనాల కారణంగా వ్యక్తిత్వం కోల్పోవడంతో పాటు సమాజంలో చులకనకు గురవుతారన్నారు. మత్తు పదార్థాలకు అలవాటైన వారిని డి ఎడిక్షన్ చికిత్సతో సాధారణ స్థితికి తీసుకురావచ్చని తెలిపారు. కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ జోనల్ కోఆర్డినేటర్ సజ్మా, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, విజయరాణి, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి రజిత తదితరులు పాల్గొన్నారు.

అందరి కృషితో పర్యావరణ పరిరక్షణ

పెనమలూరు: పర్యావరణ పరిరక్షణకు అందరు కృషి చేయాలని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ కన్వీనర్ ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి అన్నారు. కానూరు సిద్ధార్థ లా కాలేజీలో శుక్రవారం పర్యావరణ పరిరక్షణ, రాజకీయ పార్టీల మేనిఫెస్టోలో పర్యావరణానికి ప్రాధాన్యం కల్పించడంపై జరిగిన సదస్సులో ప్రసంగించారు. పర్యావరణ పరిరక్షణలో రాజకీయ పార్టీలు బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ పురుషోత్తమరెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరరక్షణ లేక ప్రపంచంలో అనేక సంఘటనలు జరిగాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు అనేక చట్టాలు ఉన్నా అవి సక్రమంగా అమలు జరగటంలేదని తెలిపారు. ఇప్పటికైనా భవిష్యత్ అవసరాల దృష్ట్యా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జర్నలిస్టు వెంకట్రావు, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నుపాటి దివాకర్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల పూర్తిస్థాయి ప్రగతికి కృషి

కంకిపాడు: ఎస్సీ, ఎస్టీల హక్కుల సాధనకు ఉద్యమించాలని, పూర్తిస్థాయి ప్రగతికి కృషి చేద్దామని ఆ సంఘ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఇంటూరి ఏలియా పిలుపునిచ్చారు. కంకిపాడులోని సంఘ కార్యాలయంలో సంఘం జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కంకిపాడు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కోలవెన్ను గ్రామానికి చెందిన లాం ప్రతాప్, ఉపాధ్యక్షుడిగా టెక్కెం శేషుబాబు, ప్రధాన కార్యదర్శిగా కె.చిట్టిబాబు, కార్యదర్శిగా జగన్నాథశ్రీనివాసరావు, కోశాధికారిగా గరికె వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. నూతన కమిటీకి ఏలియా నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాలు పూర్తిస్థాయిలో ప్రగతి సాధించాలన్నారు. సంఘాన్ని బలోపేతం చేయడంలో ముఖ్యభూమిక పోషించాలని సూచించారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంభా ప్రభుదాసు, రాష్ట్ర కోశాధికారి ఉయ్యాల ఏడుకొండలు, నాయకులు పాల్గొన్నారు.


నియామకపత్రాలు అందిస్తున్న 'ఎస్సీ, ఎస్టీ' పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఏలియా

క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక వికాసం

గన్నవరం రూరల్: క్రీడలు శారీరక దారుఢ్యానికి, మానసిక వికాసానికి దోహదం చేస్తాయని ఎంపీపీ అనగాని రవి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య పేర్కొన్నారు. మండలంలోని సూరంపల్లి వేణుగోపాలస్వామి క్రికెట్ గ్రౌండ్‌లో శుక్రవారం యంగ్ బాయ్స్ ఆధ్వర్యాన జరుగుతున్న క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ ఐక్యత, క్రీడా స్ఫూర్తి, స్నేహభావానికి ప్రతీకలుగా క్రికెట్ పోటీలు నిలుస్తాయన్నారు. ఎంతో ఉత్సాహంగా పోటీలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఎంపీటీసీ సభ్యుడు త్రిపిర్నేని బాబి, మాదల వెంకటేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.


సూరంపల్లిలో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ అనగాని రవి, తోట వెంకయ్య

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

నున్న(విజయవాడరూరల్): నున్న పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులకు శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. 54 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఒక్కొక్కరికి రెండు జతల దుస్తులు, ఒక తుండు, జత చెప్పులు చొప్పున 2023-24 సంవత్సరానికి అందజేశామని సర్పంచి కాటూరి సరళశ్రీనివాస్ అన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి నెలా జీతాలు చెల్లిస్తున్నామన్నారు. త్వరలో రెయిన్ కోట్లు అందజేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ, పలువురు పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉచిత కోచింగ్

పెనమలూరు: నియోజకవర్గంలో పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉచిత కోచింగ్ అందించనున్నామని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కానూరులోని శరత్‌చంద్ర ఐఏఎస్ అకాడమీ సహకారంతో పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉచితంగా గ్రూప్ వన్ పరీక్షలకు కోచింగ్ ఇస్తామని పేర్కొన్నారు. కోచింగ్‌తో పాటు స్టడీ మెటీరియల్ కూడా విద్యార్థులకు అందజేస్తామని వివరించారు. మరిన్ని వివరాలుకు కానూరు 100 అడుగుల రోడ్డులో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

బెల్ట్ షాపుల నిర్వాహకులపై కఠిన చర్యలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం అక్రమంగా విక్రయించినా, బెల్ట్ షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్ హెచ్చరించారు. బాపులపాడు మండలం కొత్తపల్లి, ఆరుగొలనులో శుక్రవారం ఆయన పలు దుకాణాల్లో తనిఖీలు చేశారు. బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి, వీరి నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరిపై కేసులు నమోదు చేసి నూజివీడు కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ జనార్దన్ తెలిపారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

గంగూరు డేంజర్ జోన్‌లో రూ.1.50 లక్షలతో సిగ్నల్ లైట్లు

పెనమలూరు: విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై గంగూరు సెంటర్‌లో ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. డేంజర్ జోన్‌గా ఉన్న గంగూరు సెంటర్‌లో ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేశారు. పారిశ్రామిక వాడగా ఉన్న గంగూరు సెంటర్‌లో నిత్యం ట్రాఫిక్ అధికంగా ఉంటుంది. ఇక్కడ విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి మలుపు తిరిగి ఉండటం, గంగూరు నుంచి వచ్చే వాహనాలు నేరుగా రోడ్డు పైకి రావటంతో ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రాణాలు కోల్పోయిన వారు సైతం ఉన్నారు. బోర్డులు ఏర్పాటు చేసినా ప్రమాదాలు ఆగలేదు. రాత్రి సమయాల్లో రోడ్డు మధ్యలో ఉన్న లైట్లు వెలగక పోవడంతో ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. దీంతో ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు దృష్టి పెట్టారు.

దాత సాయంతో..

గంగూరులో ప్రమాదాలు జరగకుండా ఉండటానికి ట్రాఫిక్ పోలీసులు కొత్తగా సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేశారు. దాత సహాయంతో రూ.1.50 లక్షలు వెచ్చించి 8 సిగ్నల్ లైట్లు పెట్టారు. త్వరలో సిగ్నల్ లైట్లు ప్రారంభించనున్నారు.


గంగూరు కూడలి వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సిగ్నల్స్

వేగాన్ని నియంత్రిస్తాం

గంగూరు సెంటర్‌లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాం. ప్రధానంగా ఇక్కడ రాత్రి సమయాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండటంతో సిగ్నల్ లైట్లు పెట్టాం. దీంతో వాహనాల వేగాన్ని నియంత్రించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

–వెంకటనారాయణ, సీఐ, ట్రాఫిక్

రేపు 'వీకేఆర్' పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గన్నవరం: కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో ఈ నెల 7వ తేదీన జరగనున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని కళాశాల పూర్వ విద్యార్థి సంఘం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. సుమారు ఐదు దశబ్దాల పైన చరిత్ర కలిగిన వీకేఆర్ కళాశాల వేలాది మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిందన్నారు. తమ ఉన్నతికి తోడ్పడిన కళాశాలలో పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకునేందుకు ఏటా జనవరంలో మొదటి ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సమ్మేళనం మొదలవుతుందని పేర్కొన్నారు.

అత్తింటివారిపై వరకట్నం వేధింపుల కేసు

పెనమలూరు: అత్తింటివారి వేధింపులపై పెనమలూరు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం కానూరు వరలక్ష్మీపురం శ్రీ హనుమాన్ హైట్స్‌లో నివసిస్తున్న ఎండీ కరీషకు గుంటూరులో 2007లో ఇంటర్ చదువుతున్నప్పుడు పి.వికాస్‌తో పరిచయం ఏర్పడింది. కరీష 2012లో విజయవాడలో ఎంబీఏ పూర్తి చేసిన తరువాత కుటుంబ సభ్యులు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. అప్పుడు తాను వికాస్‌ను ప్రేమించానని తెలిపింది. ఇరు పక్షాల పెద్దలు అంగీకరించడంతో వీరు 2015లో పటమట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వివాహం చేసుకున్నారు. పెళ్లి సమయంలో కరీష తండ్రి బంగారు ఆభరణాలు కట్నంగా ఇచ్చాడు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. భర్త దురలవాట్లకు లోనై అప్పులు చేయటంతో కరీష తండ్రి అనేక సార్లు సొమ్ము ఇచ్చాడు. భర్త వికాస్‌తో పాటు అత్త సుభాషిణి, ఆడపడుచు సుష్మ అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తూ కరీషను పుట్టింటికి పంపేశారు. కాపురానికి తీసుకు వెళ్లాలని కోరితే బెదిరిస్తున్నారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు అత్తింటివారిపై కేసు నమోదు చేశారు.

జల్‌జీవన్ మిషన్ పనులు ప్రారంభం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు జగనన్న కాలనీలో జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.164.54 లక్షలతో మంచి నీటి సరఫరా పైపులైన్లతో పాటు కుళాయిల ఏర్పాటుకు గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని), జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక చేతుల మీదుగా శుక్రవారం పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి ఉప్పాల రాము, పార్టీ రాష్ట్ర నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్, ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి, ఎంపీపీ కొడాలి సురేష్, కొండలమ్మ ఆలయ మాజీ చైర్మన్లు కనుమూరి రామిరెడ్డి, తాళ్లూరి మాధవ్, పీఏసీఎస్ అధ్యక్షుడు దుగ్గిరాల శేషుబాబు, శేషం గోపి, వ్యవసాయ సలహా కమిటీ జిల్లా డైరెక్టర్ పెన్నేరు ప్రభాకర్, సర్పంచులు కోటప్రోలు నాగు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కుమారుడు కనిపించడం లేదని ఫిర్యాదు

పెనమలూరు: కుమారుడు కనిపించడం లేదని తల్లి ఫిర్యాదు చేయడంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం ఉద్దండరామపాలెంకు చెందిన కొండూరు రాఘవమ్మ కుమారుడు కొండూరు వెంకటేష్ పోరంకిలో కారు డ్రైవర్. అతను కానూరు సిద్ధార్థ కాలేజీ వద్ద జానకి మెస్‌లో తింటూ అక్కడే రూమ్‌లో ఉంటున్నాడు. వెంకటేష్‌కు గత అక్టోబర్‌లో విజయవాడకు చెందిన ఎంగేజ్‌మెంట్ జరిగింది. నవంబర్ 2వ తేదీన కానూరులో జానకి మెస్ నుంచి వెంకటేష్ తల్లితో ఫోన్‌లో మాట్లాడిన తరువాత అతను కనిపించలేదు. పలుచోట్ల వెదికినా వెంకటేష్ జాడ తెలియలేదు. దీంతో అతని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

మద్యం విక్రేత అరెస్ట్

పెనమలూరు: పెదపులిపాకలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పెదపులిపాక గ్రామానికి చెందిన వేమూరి జాన్‌పీటర్ గ్రామంలో మద్యం అక్రమంగా విక్రయిస్తుండటంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 18 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.